సమావేశంలో పాల్గొన్న డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్, అధికారులు

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో ఆదాయం

ఏటూరునాగారం, జనవరి 8 : సోలార్ పవర్ ప్లాంట్లతో మహిళలు ఆదాయం పొందవచ్చని, వాటి ఏర్పాటుకు అవసరమైన మేరకు భూమిని గుర్తించాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పోచం, ఏవో రాజ్‌కుమార్ కోరారు. స్థానిక ఐటీడీఏ సమావేశ హాల్‌లో పెసా గ్రామ కమిటీ కోఆర్డినేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ పవర్ ప్లాంట్లకు ఏర్పాటుకు అవసరమైన నాలుగు ఎకరాల స్థలాన్ని సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండేలా చూడాలన్నారు. ఎస్‌హెచ్‌జీ, వీవోలకు ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒక ప్లాంటుకు రూ. 3కోట్ల వరకు ఖర్చు అవుతుందని, ఇందులో 90శాతం సబ్సిడీ ఉంటుందని, పది శాతం నిర్వాహకులు కట్టాల్సి ఉంటుందన్నారు. ఇది కూడా బ్యాంకు ద్వారా లోన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 31 వరకు సబ్ స్టేషన్లు ఉన్నట్లు వివరించారు. ప్రతి ప్లాంట్ ద్వారా ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. పెసా మొబిలైజర్లు గ్రామాల్లో ప్రచారం చేపట్టి సంఘాలు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జగదీశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, ఎస్‌వో సురేశ్‌బాబు, ఏటీడీవో క్షేత్రయ్య, డీటీ అనీల్, పెసా జిల్లా కో ఆర్డినేటర్ ప్రభాకర్, జీసీడీవో సుగుణ, గిరిజన గ్రామాల పెసా మొబిలైజర్లు పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్

ములుగురూరల్ : సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుపై హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ములుగురూరల్/కాటారం/మొగుళ్లపల్లి, జనవరి 8 : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సందీప్‌రెడ్డి అన్నారు. బుధవారం ములుగు ప్రభుత్వ దవాఖానలో వైద్యులతోపాటు వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైన వారు 1930టోల్‌ఫ్రీ నంబర్‌కు గాని www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో గాని ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, సైబర్ క్రైమ్ సీఐ యాసిన్, ఆర్ఎంవో సుజిత్, వైద్యులు చంద్రశేఖర్, భిక్షపతిరావు, ప్రవీణ్‌రెడ్డి, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, కాటారం మండలం చిద్నెపల్లి పంచాయతీ పరిధిలో సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుళ్లు లక్ష్మీరాజు, రఘు, నాగరాజు అవగాహన కల్పించారు. మొగుళ్లపల్లి మండలంలోని కొరికిశాల కేజీబీవీలో విద్యార్థినులకు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్/చిట్యాల, జనవరి 8 : గురుకులాల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 1 లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ దివాకర, జయశంకర్ భూపాలపల్లి జిల్లా గురుకులాల సమన్వయ అధికారి గోల్కొండ భిక్షపతి తెలిపారు. 2025-26విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశం పొందేందుకు ఫిబ్రవరి 23న ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. https://tgcet.cgg.gov.inలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు భూములు గుర్తించాలి

కలెక్టర్ రాహుల్ శర్మ

ట్రెస్సా డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, జనవరి 8 : సౌర శక్తి విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు భూములను గుర్తించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుపై రెవెన్యూ, విద్యుత్, డీఆర్డీఏ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఈ నెల 20 వరకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉన్నందున 17 వరకు పూర్తి నివేదికలు అందజేయాలన్నారు. జిల్లా నుంచి 150 ఎకరాలు ఇవ్వాల్సి ఉందని, ఇప్పటి వరకు 28 ఎకరాలు గుర్తించినట్లు తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక మెగావాట్ సోలార్ ప్లాంటు ఏర్పాటుకు 4 ఎకరాల భూమి అవసరం ఉందని, నియోజకవర్గంలో స్మాల్ అండ్ మైక్రో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు 5ఎకరాలు గుర్తించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్‌శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, అన్ని మండలాల తహసీల్దార్లు, విద్యుత్ శాఖ డీఈలు, ఏఈలు, డీఆర్డీఏ ఏపీఎంలు పాల్గొన్నారు. కాగా, అంతకు ముందు సోలార్ పవర్ ప్లాంట్లపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్‌రాహుల్‌శర్మ పాల్గొన్నారు. అలాగే, భూపాలపల్లి జిల్లా ట్రెస్సా డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు. ఆర్డీవో మంగీలాల్, కలెక్టరేట్ ఏవో ఖాజా మొయినోద్దీన్, ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు మార్క రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ రజాక్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, గురుకుల ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. విద్యార్థులకు సత్వర ధ్రువీకరణ పత్రాల జారీకి కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు.

భూ పరిపాలనలో నూతన మార్పులు

రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కార్యాలయంలో తెలంగాణ భూ భారతి చట్టంపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు భూ సమస్య ఎదురైతే పైసా ఖర్చు లేకుండా ఉచిత సలహాలు పొందేందుకు వీలు కల్పించినట్లు తెలిపారు. భూ వివాదాలకు కోర్టుల చుట్టూ తిరగకుండా జిల్లా స్థాయిలోనే రెండు అప్పీళ్ల వ్యవస్థలు ఉంటాయన్నారు.

నియామక పత్రం అందజేస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు అల్లం రవీందర్

బీఆర్ఎస్ ముచినిపర్తి గ్రామ అధ్యక్షుడిగా నర్సింగరావు

చిట్యాల, జనవరి 8 : బీఆర్ఎస్ ముచినిపర్తి గ్రామ అధ్యక్షుడిగా ఇంగిలి నర్సింగరావును ఏకగ్రీవంగా నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ తెలిపారు. అలాగే, ఉపాధ్యక్షులుగా కంకల రాయకొమురు, గోగుల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దామెర సాంబయ్య, కార్యదర్శిగా కొంకుల రవి, కోశాధికారిగా అబ్బు సాంబరెడ్డి, యూత్ కమిటీ అధ్యక్షుడిగా అన్నారపు రమణకుమార్ ఎన్నిక కాగా, బుధవారం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ వైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు టొటం నవీన్, ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్, నాయకులు పిట్ట సురేశ్, రావుల రమేశ్, దామెర రాజు, కందికొండ సదయ్య, ఇంగిలి శ్రీనివాస్, పుప్పాల సదయ్య, గుండెకారి రాజు పాల్గొన్నారు.

నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలి

నూనె శ్రీనివాస్

వెంకటాపూర్, జనవరి 8 : మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న పీవీ నర్సింహారావు ఓపెన్‌కాస్టు మైనింగ్ కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.40లక్షల నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకుడు నూనె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తాళ్లపాడు వద్ద రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. 40ఏళ్ల నుంచి భూమి సాగుచేసుకుంటూ జీవిస్తున్నామని, రామప్పకు యునెస్కో గుర్తింపు లభించిన తర్వాత పనులు ఆపిన సింగరేణి అధికారులు మళ్లీ ఓసీ చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని అధికారులను కోరారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగురూరల్, జనవరి 8 : బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని గ్రంథాలయ సంస్థ మాజీ వైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. గత నెల 29న కొత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి రామారావు గుండెపోటుతో మృతి చెందగా బుధవారం ఆయన స్వగ్రామంలో జరిగిన పెద్ద కర్మకు బీఆర్ఎస్ నాయకులు హాజరై రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవింద్‌నాయక్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను కేసీఆర్ ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. రామారావు కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు అందజేసిన రూ.50వేల నగదును రామారావు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, నాయకులు వెల్పూరి సత్యనారాయణరావు, మాసిపెద్ది సత్యనారాయణరావు, దేవరనేని స్వామిరావు, వెంకటస్వామి, లింగంపల్లి సంపత్‌రావు, రవీందర్‌నాయక్, కవ్వంపల్లి బాబు, చెన్న విజయ్, అనుమతుల సురేశ్, గడ్డమీది భాస్కర్, బైకాని ఓదేలు, ఎండీ అంకూస్, దేవేందర్‌రావు, రవీందర్‌రావు, శ్రీనివాస్‌రావు, అప్పాజీ ఐలయ్య, సలేందర్‌రావు, రంజిత్, గణేశ్, మహేశ్, సమ్మయ్య, శ్రీను, ప్రకాశ్, మల్లయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ చూడకుంటే స్థిరాస్తులు జప్తు

ములుగురూరల్, జనవరి 8 : తల్లిదండ్రుల పోషణ చూడకుంటే స్థిరాస్తులు జప్తు చేసి, కన్నవారికి అప్పగిస్తామని ములుగు డివిజన్ మెజిస్ట్రేట్, ఆర్డీవో వెంకటేశ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో సీనియర్ సిటిజన్స్ పోషణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. వారసత్వ ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గత నెల 2న ములుగు జిల్లా కేంద్రానికి చెందిన ఇమ్మడి లక్ష్మీ-సమ్మయ్య దంపతులు తమ వ్యవసాయ భూమిని కుమారుడు ఇమ్మడి నాగరాజు, కోడలు పద్మ కలిసి అక్రమంగా స్వాధీనం చేసుకొని, తమ పోషణను పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసినట్లు ఆర్డీవో తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి, ఇరు పక్షాలను విచారించి వృద్ధ దంపతులకు జీవన భృతి కోసం ప్రతి నెలా రూ.6వేలు చెల్లించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో తల్లిదండ్రులను పట్టించుకోని వారిపై సైతం ఇలాగే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

మహదేవపూర్ ప్రభుత్వ పాఠశాలకు రాష్ట్రస్థాయి ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

మహదేవపూర్, జనవరి 8 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు అరుదైన గుర్తింపు దక్కింది. హైబీజ్ సంస్థ ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు-2024లో భాగంగా ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అవార్డును హెచ్ఎం సరిత అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ బోధన, లైబ్రరీ వినియోగం, సైన్స్‌పై అవగాహన, సమకాలిన అంశాలపై విద్యార్థులను పోటీలకు పంపడం, విలువలతో కూడిన విద్య అందించడం, క్రీడల్లో, చదువుల్లో రాష్ట్ర స్థాయిలో రాణించడంతో పాఠశాలకు ఈ గౌరవం దక్కిందన్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మడక మధు, పీఈటీ పూర్ణిమ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ములుగురూరల్, జనవరి 8 : రోడ్డు భద్రత పోస్టర్లను రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, డీపీఆర్‌వో ఎండీ రఫిక్, ఎంవీఐ వినోద్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌భాస్కర్‌తో కలిసి ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. అలాగే, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఏటూరునాగారం/గోవిందరావుపేట : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఏటూరునాగారం ఎస్సై తాజుద్దీన్ కోరారు. మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు ప్రాంతంలో రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రైనీ ఎస్సైలు సాయి కృష్ణ, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, గోవిందరావుపేటలో ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

యుద్ధ ప్రతిపాదికన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు

కృష్ణ కాలనీ, జనవరి 8 : రైతులకు యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి సర్కిల్ చీఫ్ ఇంజినీర్ బీ మల్చూర్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024లో 2,328 సర్వీసులను మంజూరు చేశామని, ఒక్క డిసెంబర్‌లోనే దాదాపు 314 మంజూరు చేశామని పేర్కొన్నారు. 2023తో పోల్చుకుంటే దాదాపు 24 శాతం పెరిగిందని, వ్యవసాయ సర్వీసుల మంజూరుకు అన్ని సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దరఖాస్తు స్థితిగతులను ఎప్పటికప్పుడు అగ్రికల్చర్ పోర్టల్(ఆన్‌లైన్)లో చూసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ -స్టార్ విధానం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకొని కావాల్సిన సమయంలో పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో పనిచేసే విద్యుత్ అధికారులకు ఎంతో సమయం ఆదా అవుతుందని వివరించారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా 'పొలంబాట' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.

కేటీఆర్‌పై ఆరోపణలకు భయపడేది లేదు

కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి

కృష్ణ కాలనీ, జనవరి 8 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఎలాంటి తప్పు చేయలేదని, సీఎం రేవంత్ రెడ్డి కావాలనే తప్పుడు కేసులు సృష్టిస్తూ మాజీ మంత్రి కేటీఆర్‌ను జైలుకు పంపాలని కుట్ర చేస్తున్నాడని కేటీఆర్ సేన భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వీసం భరత్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ శాఖ మంత్రిగా రాష్ట్రాన్ని ప్రపంచ ఆర్థిక అగ్రదేశాల్లో ఒకటిగా నిలిపారన్నారు. కేటీఆర్ తెలంగాణ రాష్ట్రానికి చేసిన సేవలను పూర్తిగా మరచిపోయి, సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ కేసులతో బీఆర్ఎస్‌ను బలహీన పరచాలని చూస్తున్నాడని ఆరోపించారు. కేసులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేటీఆర్‌కు ప్రజల్లో వచ్చే ఆదరణ చూసి ఓర్వలేకనే వ్యక్తిగతంగా అక్రమ కేసులు పెడుతున్నారని, కాంగ్రెసోళ్లు ఎన్ని ఆరోపణలు చేసినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

12నుంచి ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్

గోవిందరావుపేట, జనవరి 8 : మండలంలోని చల్వాయి జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఈ నెల 12 నుంచి 14వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ కమిటీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.15,016, రెండో బహుమతి రూ.10,016, మూడో బహుమతి రూ.5,016, నాలుగో బహుమతి రూ.3,016 నగదు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 10 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని, ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని తెలిపారు. వివరాలకు 93980624 14,7993772735 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 8 : వెంకటాపురం జెడ్‌లో గల 1.20 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ములుగు తహసీల్దార్ లక్ష్మీరాజయ్య బుధవారం ఎస్సై కొప్పుల తిరుపతిరావుకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని సర్వే నంబర్ 16, 17లో ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టినప్పటికీ ఓ వ్యక్తి ఆక్రమించి మక్కజొన్న పంట సాగు చేస్తున్నాడని తెలిపారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్సైని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే 95శాతం పూర్తి

గణపురం, జనవరి 8 : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల నమోదు ప్రక్రియ 95శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సర్వేలో పాల్గొనని దరఖాస్తుదారులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఈ నెల 10లోపు ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

'బిల్ట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

ములుగురూరల్, జనవరి 8 : తప్పుడు ఇంటి నంబర్లతో అనుమతులు పొందిన బిల్ట్ ప్రైవేట్ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ విషయమై డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం వారు మాట్లాడారు. బిల్ట్ పాఠశాల యాజమాన్యం ఒకే ఇంటి నంబర్‌పై రెండు బ్రాంచ్‌లను నిర్వహిస్తున్నారన్నారు. వేర్వేరు క్యాంపస్‌లలో నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి, అనుమతులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు సాదు రాకేశ్, దీకొండ భరత్, లక్ష్మణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, జనవరి 8 : ఉచిత కుట్టుమిషన్ల కోసం భూపాలపల్లి జిల్లాలోని అర్హులైన క్రిస్టియన్ మైనార్టీ మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని పేద, నిరుద్యోగ మైనార్టీ మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన మహిళలు జనవరి 20 సాయంత్రం 5 గంటల లోపు TGOBMMS వెబ్ పోర్టల్ tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని, వెంటనే అవసరమైన పత్రాలతో పాటు కాపీని జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

అక్రమ డిప్యూటేషన్‌ను రద్దుచేయాలి

మంగపేట, జనవరి 8 : అకినేపల్లి మల్లారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు కల్పించిన అక్రమ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని బుధవారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల వద్ద వారు నిరసన తెలిపారు. ములుగు జిల్లాలోని మారుమూల గ్రామంలోని పాఠశాలలో పనిచేస్తూ డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలకు రప్పించాలని కోరారు. అక్రమ డిప్యూటేషన్ల వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన సదస్సు

వెంకటాపురం(నూగూరు), జనవరి 8 : ఆదివాసీ హక్కుల చట్టాలపై తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచందర్ మాట్లాడుతూ ఆదివాసీ యువత చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాలక ప్రభుత్వాలు ఆదివాసీలకు చేసే మోసాన్ని తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు పూనెం మునేశ్వరావు, తాటి లక్ష్మయ్య, చింత సోమరాజు, తాటి నర్సింహారావు, గణేశ్, సందీప్, ఉషారాణి, స్వరూప, లక్ష్మి, రాధ, మల్లయ్య పాల్గొన్నారు.

కొండాయిలో సీజనల్ వ్యాధులపై అవగాహన

ఏటూరునాగారం, జనవరి 8 : మండలంలోని కొండాయిలో హెచ్ఎంపీవై వైరస్, సీజనల్ వ్యాధులపై ప్రజలకు డాక్టర్ ప్రణీత్ కుమార్ బుధవారం అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వెంటనే వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. ఈ వైరస్ గురించి ఆందోళన వద్దన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, ఏఎన్ఎం సమ్మక్క, ఆశ వర్కర్లు లక్ష్మి, మల్లేశ్వరి, భాగ్య పాల్గొన్నారు.

జీరో టిల్లేజ్ పద్ధతితో రైతులకు లాభం

వెంకటాపూర్, జనవరి 8 : మండలంలోని నర్సాపూర్ క్లస్టర్ పరిధిలోని ఇంచెంచెరువుపల్లిలో జాతీయ ఆహార పథకంలో భాగంగా జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగు చేస్తున్న మక్కజొన్నలో బుధవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఎం శైలజ మాట్లడుతూ జీరో టిల్లేజ్ పద్ధతితో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, పరసింహ, లక్ష్మణ్, నరేశ్, భరత్ పాల్గొన్నారు.

ఓసీ-3 ప్రమాద ఘటనలో డ్రైవర్ మృతి

అన్వర్ పాషా (ఫైల్)

గణపురం, జనవరి 8 : మండల పరిధిలోని కేటీకే ఓసీ-3 గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 2న ఓసీ-3 ప్రాజెక్టు క్వారీలోకి వెళ్తున్న వాల్వో డంపర్ పొగమంచు కారణంగా ముందు వెళ్తున్న మరో డంపర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ అన్వర్ పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం మొదట స్థానిక సింగరేణి ఏరియా హాస్పిటల్ తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ అన్వర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అన్వర్ మృతితో ఆ కుటుంబం రోడ్డున